క్లుప్తంగా

వెల్దుర్తి ఎస్ఐగా సమందర్ వలి



వెల్దుర్తి: వెల్దుర్తి ఎస్ఐగా సమందర్ వలి మంగళవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు పల్నాడు జిల్లా ఎస్పీ కార్యాలయంలో విధులు నిర్వహించిన ఆయన ఇక్కడకు బదిలీపై వచ్చినట్లు తెలిపారు. ఇక్కడ ఉద్యోగ బాధ్యతలు నిర్వహించిన సత్యనారాయణ వినుకొండకు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా సమందర్ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.

ఆధార్ నమోదు కేంద్రాలను వినియోగించుకోండి



పిడుగురాళ్ల : ఆధార్‌నమోదు కేంద్రాలను ప్రజలు సద్వినియోగంచేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్ చెప్పారు. పట్టణంలోని చెరువు కట్ట బజారులో 25, 27 వార్డు ప్రజల కోసం ఆధార్ నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్టు వివరించారు. మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ.. 23, 24, 25 తేదీల్లో మూడు రోజులు గాంధినగర్‌లోని సచివాలయం, పీడబ్ల్యూడీ కాలనీలోని సచివాలయాల వద్ద ఈ ఆధార్ నమోదు కేంద్రాలను కొనసాగిస్తామని వీటిని ప్రజలు వినియోగించుకోవాలని ఆయన తెలిపారు.

డంపింగ్ యార్డు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి



పిడుగురాళ్ల : డపింగ్ యార్డు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని మున్సిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్ అన్నారు. పట్టణంలోని కొండమోడు డపింగ్ యార్డు పరిసర ప్రాంతాలను మున్సిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... డపింగ్ యార్డు ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తడి చెత్త, పొడి చెత్తలను వేరు చేయటంలో సిబ్బంది క్రియాశీలకంగా పని చేయాలని సూచించారు. దీని వలన మున్సిపాలిటీ ఆర్థికంగా మరింతగా బలోపేతం అవుతుందని ఆయన తెలియజేశారు. మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చెట్టినాడ్ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల ఆందోళన



దాచేపల్లి : మండలంలోని పెదగార్లపాడు చెట్టినాడ్ సిమెంట్ ఫ్యాక్టరీ వద్ద కార్మికులు మంగళవారం ఆందోళన చేపట్టారు. కాంట్రాక్టర్‌కి యజమాన్యం బిల్లులు చెల్లించకపోవటంతో కార్మికులకు వేతనాలు చెల్లించలేదు. దీంతో సంబంధిత కాంట్రాక్టర్ పరిధిలో పనిచేస్తున్న కార్మికులు ప్రధానగేట్ వద్దకు చేరుకుని గేట్లు వేసి ఆందోళనకు దిగారు. తక్షణమే కాంట్రాక్టర్‌కి బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. యజమాన్య ప్రతినిధులు కార్మికులతో చర్చలు జరిపి త్వరలో బకాయిలు చెల్లిస్తామని హామీ ఇవ్వటంతో ఆందోళన విరమించారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి

నాదెండ్ల: విద్యార్థులకు మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని ఉద్యోగ, వ్యాపార రంగాల్లో రాణించాలని ప్రిన్సిపల్ డాక్టర్ ఎం శ్రీనివాసరావు చెప్పారు. గణపవరం చుండి రంగనాయకులు కళాశాలలో మంగళవారం ఫ్రెషర్స్ డే నిర్వహించారు. జూనియర్ ఇంటర్, డిగ్రీ మొదటి సంవత్సరం విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నూతనంగా చేరిన విద్యార్థులు గతంలో ఉన్నత విజయాలు సాధించిన విద్యార్థులను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. విద్యాభ్యాసంలో క్రమశిక్షణతో చక్కగా రాణించాలన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపల్ ఎం శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపల్ సీహెచ్ చైతన్య, కళాశాల వ్యవస్థాపకుడు చుండి రంగనాయకులు మనుమడు రంగనాయకులు, లైబ్రేరియన్ నిరంజన్‌లను సన్మానించారు.

రాయితీపై వ్యవసాయ పరికరాలు

శావల్యాపురం: ఉద్యాన శాఖ వారి సారథ్యంలో రైతులకు రాయితీపై వ్యవసాయ యంత్రీకరణ పరికరాలు అందజేస్తున్నట్లు ఉద్యాన శాఖాధికారి షేక్ నబీ రసూల్ మంగళవారం తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొని అనంతరం మాట్లాడుతూ రైతులకు రాయితీపై తైవాన్ స్ప్రైయర్లు, మినీ ట్రాక్టర్లు ప్రభుత్వ పరంగా రాయితీపై అందజేస్తున్నట్లు తెలిపారు.

నాడు కళకళ.. నేడు విలవిల

- సచివాలయాలను నిర్వీర్యం చేస్తున్న కూటమి ప్రభుత్వం
- కీలక సేవలకు మంగళం
- రేషన్‌కార్డులు, ఆరోగ్యశ్రీ, ధ్రువీకరణ పత్రాల కోసం ప్రజల ఎదురుచూపులు

గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని సాధించేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి నెరవేర్చింది. పల్లెల్లోనే ప్రజలకు సత్వరమే సమస్యలు పరిష్కారమయ్యేలా ఏర్పాటైన సచివాలయాలు ప్రస్తుతం నిరుపయోగంగా మారుతున్నాయి. గతంలో సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు 545 రకాల సేవలు అందేవి. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సచివాలయాల్లో సేవలు నిర్వీర్యమయ్యాయి. ఇప్పటి వరకు ప్రభుత్వ పథకాలకు సంబంధించి ఏ ఒక్క ప్రభుత్వ వెబ్‌సైట్ కూడా ఓపెన్ కావడం లేదు. దీంతో కొత్త పింఛన్లు, రేషన్, ఆరోగ్యశ్రీ కార్డుల కోసం దరఖాస్తు చేసుకునేందుకు అర్హులైన లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారు.



నియోజకవర్గ వ్యాప్తంగా సచివాలయాలు, ఉద్యోగులు, వలంటీర్లు ఇలా..

మండలం	సచివాలయాలు	సచివాలయ ఉద్యోగులు	వలంటీర్లు
గురజాల	18	180	330
దాచేపల్లి	17	170	418
మాచవరం	15	150	295
పిడుగురాళ్ల	32	320	670

గురజాల : పదేళ్ల క్రితం ప్రభుత్వ సేవలను పొందేందుకు ప్రజలు మండల కేంద్రాల్లోని ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండేది. ప్రజల కష్టాలను గమనించిన గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గ్రామ సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టింది. రెండు వేల జనాభాకు ఒక సచివాలయాన్ని ఏర్పాటు చేసి వలంటీర్ల ద్వారా ప్రజలకు ఇంటి ముంగిటికే సేవలను అందించింది. సచివాలయంలో వివిధ శాఖలకు సంబంధించిన ఉద్యోగులను నియమించి ప్రజల సమస్యలను అక్కడే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంది. అయితే కూటమి ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేసే దిశగా అడుగులు వేస్తోంది. వలంటీర్ల సేవలకు మంగళం పలికింది. సచివాలయాల ద్వారా అందించే కీలకమైన సేవలను నిలిపివేసింది. అధికారంలోకి వచ్చి వంద రోజులు పూర్తయినా సేవలను పునరుద్ధరించకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు.

సాధారణ సేవలకే పరిమితం

చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చి అయిదు నెలలు కావస్తున్నా నేటికీ కొత్త రేషన్ కార్డులు, నూతన పింఛన్ మంజూరు, ఆరోగ్య శ్రీ కార్డులు వెబ్ సైట్లు తెరుచుకోకపోవడమే ఇందకు నిదర్శనంగా చెప్పవచ్చు. వివిధ సేవలకు సంబంధించి సర్టిఫికెట్ల జారీలో కీలకంగా ఉన్న కంప్యూటర్ ప్రింటర్లూ చాలా సచివాలయాల్లో పనిచేయడం లేదు. ప్రస్తుతం 1బీ, కులం, ఆదాయం, తదితర సాధారణ సేవలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. దీంతో అనేక మంది ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

సచివాలయ ఉద్యోగులే దిక్కయినా కక్షసాధింపు

ప్రతిపక్షంలో ఉండగా సచివాలయ వ్యవస్థను అవహేళన చేసిన టీడీపీ కూటమికి ఇప్పుడు వారే దిక్కయ్యారు. వలంటీర్లు లేకపోవడంతో సచివాలయ ఉద్యోగులతోనే ఇంటింటికీ పింఛన్ల పంపిణీ చేపడుతోంది. ప్రభుత్వ పథకాల ప్రచార కార్యక్రమాలనూ వారే నిర్వర్తిస్తున్నారు. ఇటీవల భారీ వర్షాలు, వరదల సమయంలోనూ సేవలందించారు.

వలంటీర్లకు ఇచ్చిన హామీ మాటేమిటి?

ఎన్నికల సమయంలో కూటమి నేతలు వలంటీర్లను కొనసాగిస్తామని, వారి జీతాన్ని రూ.పదివేలకు పెంచుతామని హామీ ఇచ్చారు. ఎన్నికలై అధికారం చేపట్టిన తర్వాత ఆ హామీ గురించి పెదవి విప్పడం లేదు. వలంటీర్లను కొనసాగించలేదు. దీనిపై వలంటీర్లు నిరసన వ్యక్తం చేస్తున్నారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

కారెంపూడి: వివాహిత అదృశ్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని కారెంపూడి ఎస్ఐ ఎం.వాసు మంగళవారం తెలిపారు. కారెంపూడి ఇందిరానగర్ కాలనీలోని ముదిరాజుల బజారులో నివాసం ఉంటున్న పగడాల రమాదేవి భర్త శ్రీనివాసరావుల మధ్య గొడవ జరగడంతో 20 రోజుల క్రితం మండలంలోని పెదకొదమగుండ్ల గ్రామంలోని ఆమె పుట్టింటికి వెళ్లింది. అక్కడ నుంచి మళ్లీ గత 21న భర్త వద్దకు వచ్చిన రమాదేవి ఆ తర్వాత కన్పించడం లేదని ఆమె ఆచూకీ తెలియడం లేదని రమాదేవి తల్లి తిరువంపూడి లక్ష్మమ్మ ఎస్ఐ వాసుకు ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు స్వీకరించిన ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెరువు గుంతలో పడి పశువుల యజమాని మృతి



మృతుడు అంజయ్య (ఫైల్)

బొల్లాపల్లి : గేదెను ఒడ్డుకు తోలడానికి చెరువులోకి దిగిన పశువుల యజమానికి ప్రాణాలు కోల్పోయిన సంఘటన మండలంలోని కనుమల చెరువు గ్రామంలో మంగళవారం జరిగింది. గ్రామస్తుల సమాచారం మేరకు... గ్రామానికి చెందిన పూజల అంజయ్య (36) చెరువులోకి దిగడంతో గేదె ఒడ్డుకు తోలేందుకు చెరువులోకి దిగాడు. ఈ నేపథ్యంలో చెరువులో ఏర్పడిన గుంతల్లో పడటంతో అక్కడికక్కడే ప్రాణాలు పోగొట్టుకున్నాడు. సమీపంలోని గ్రామస్తులు గమనించి ఒడ్డుకు చేర్చారు. మృతుని భార్య తిరుపతమ్మ, ముగ్గురు సంతానం ఉన్నారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఒప్పిచర్ల విద్యార్థినుల ఎంపిక



ఎంపికైన విద్యార్థినులతో హెచ్‌ఎం విజయలలిత, ఉపాధ్యాయులు

కారెంపూడి: రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు మండలంలోని ఒప్పిచర్ల గ్రామంలోని గాడిపర్తి లక్ష్మీ మెమోరియల్ జెడ్పీ హైస్కూల్ విద్యార్థినులు ఎంపికయ్యారని ఆ పాఠశాల హెచ్‌ఎం విజయలలిత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి గుంటూరు జిల్లా సబ్ జూనియర్ బాలికల జట్టుకు రాంపాటి నాగశ్రీలక్ష్మి, పాశం శివమణి ఎంపికయ్యారని, గత శనివారం గుంటూరులో జరిగిన పోటీల్లో వీరి ఎంపిక జరిగిందని, ఈ నెల 25 నుంచి 27 వరకు చిత్తూరు జిల్లా కాణిపాకంలో జరగనున్న అంతర జిల్లాల ఖోఖో పోటీలలో ఆడనున్నారని పేర్కొన్నారు. ఇదిలా ఉంటే శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు చినరత్తయ్య, ఎంపికైన విద్యార్థినులకు పాఠశాలలో అభినందన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు.

బాలుడు అదృశ్యంపై ఫిర్యాదు



నల్లబోతుల శ్రీహరి

దాచేపల్లి : బాలుడి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సౌందర్‌రాజన్ మంగళవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. పిడుగురాళ్ల మండలం చిన్న అగ్రహారం గ్రామానికి చెందిన నల్లబోతుల వెంకటేశ్వర్లు, భ్రమరాంబ కుమారుడు శ్రీహరి కేసానుపల్లి గీతాగురుకులం హైస్కూల్‌లో 10వ తరగతి చదువుకుంటున్నాడు. దసరా సెలవులు ముగిసిన తరువాత ఈ నెల 16వ తేదిన తల్లి భ్రమరాంబ కుమారుడిని ఇంటి నుంచి తీసుకువచ్చి స్కూల్ వద్దకు వెళ్లటం కోసం దాచేపల్లిలోని కారెంపూడి బస్టాండ్ వద్ద బస్సు ఎక్కించి ఆమె ఇంటికి వెళ్లింది. నాలుగు రోజులు గడచిన తరువాత స్కూల్ యజమాన్యం శ్రీహరి స్కూల్‌కి రావటం లేదని సమాచారం అందించారు. తల్లిదండ్రులు స్కూల్‌కి వచ్చి యజమాన్యంతో మాట్లాడారు. 16నే స్కూల్‌కి పంపించినట్లు తల్లిదండ్రులు చెప్పారు. బంధువులు ఇళ్ల వద్ద శ్రీహరి ఆచూకీ కోసం ఆరా తీశారు. కుమారుడి ఆచూకీ లభించకపోవటంతో దాచేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

అప్రకటిత విద్యుత్ కోతలతో వెతలు



విద్యుత్ సబ్ స్టేషన్



మంగళవారం విద్యుత్ కోతతో అంధకారంలో ఉన్న పిడుగురాళ్ల రైల్వే స్టేషన్ రోడ్డు

- నాలుగు నెలల నుంచీ ఇదే దుస్థితి
- మంగళవారం ఐదు గంటలపాటు కరెంట్ బంద్
- ఇబ్బందులు పడిన వ్యాపారులు, ప్రజలు

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణంలో అప్రకటిత విద్యుత్ కోతలు కొనసాగుతున్నాయి. గతంలో ఎన్నడు లేని విధంగా కోతలతో ప్రజలు విలవిల్లాడుతున్నారు. నాలుగు నెలల నుంచీ ఇదే దుస్థితి నెలకొంది. రోజులో ఒక్క సారైనా కరెంట్ పోవటం సర్వసాధారణమైంది. విద్యుత్ కోత విధించిన ప్రతిసారీ అరగంటపాటు అంతరాయం తప్పడం లేదు. ఒక రెండో శనివారం అయితే ఉదయం నుంచి సాయంత్రం వరకు విద్యుత్ ఉండడం లేదు. విద్యుత్ మరమ్మతులు చేస్తున్నామని చెప్పి అధికారులు తరచూ కోతలు విధిస్తున్నారు. దీంతో వ్యాపారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలం రాత్రుళ్లు గంటల తరబడి కోతలు విధించడంతో పిల్లలు, వృద్ధులు ఉక్కపోత, దోమలతో అల్లాడుతున్నారు. విద్యుత్ అంతరాయాలను నివారించాలని గతంలో విద్యుత్ శాఖ జిల్లా అధికారి కూడా కొండమోడు సబ్ స్టేషన్ ప్రాంతాన్ని సందర్శించి సూచనలు జారీ చేసి వెళ్లారు. కానీ అధికారులు యథేచ్ఛగా కోతలు విధిస్తున్నారు. మంగళవారం జానపాడు రోడ్డు నుంచి మార్కెట్ యార్డు సెంటర్ వరకు మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి ఏడు గంటల వరకు విద్యుత్ కోత విధించారు. ఇప్పటికైనా అధికారులు అప్రకటిత విద్యుత్ కోతలు నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

రోజూ ఇదే సమస్య



ప్రజలకు ఎలాంటి సమాచారం లేకుండా కరెంట్ కోతలు కొనసాగుతున్నాయి. తాను చేసే వ్యాపారం కరెంట్‌తో కూడిన పని. నిరంతరం ఏదో ఒక సమయంలో కరెంట్ పోవటం వలన ఇబ్బందులు పడుతున్నాం.

– సయ్యద్ ఆరీఫ్, పిడుగురాళ్ల

నిద్రకు భంగం కలుగుతోంది



రాత్రి సమయాల్లో కరెంట్ పోవటం వల్ల నిద్రకు భంగం కలుగుతోంది. పిల్లలు, వృద్ధులు అల్లాడుతున్నారు. దోమలతో సహవాసం చేయాల్సి వస్తోంది. కరెంట్ తీస్తే ఎప్పుడు ఇస్తారో కూడా సమాచారం ఇవ్వట్లేదు. ఇది చాలా దారుణం. అధికారుల తీరు మారాలి.

– ముక్కాల పిచ్చయ్య, పిడుగురాళ్ల

ఎలుకల నివారణతోనే అధిక దిగుబడులు సాధ్యం



ఎలుకల నివారణ మిశ్రమాన్ని రైతులకు పంపిణీ చేస్తున్న ఏడీ బోయపాటి బ్రహ్మారెడ్డి, జిల్లా వనరుల కేంద్రం ఏడీ ప్రవీణ్



ఎలుకల నివారణ మిశ్రమం తయారీపై డెమో నిర్వహిస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది

రెంటాల(రెంటచింతల): రైతులందరూ సామూహిక ఎలుకల నివారణ చర్యలు చేపట్టడం ద్వారానే అధిక దిగుబడులను సాధించవచ్చని ఏడీ బోయపాటి బ్రహ్మారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని రెంటాల గ్రామంలో తయారు చేసిన ఎలుకల మందును తయారు చేసే విధానంపై రైతులకు అవగాహన కల్పించి అనంతరం ఆయన నాయకులతో కలిసి రైతులకు ఎలుకల మందును పంపిణీ చేసి మాట్లాడారు. మండలంలోని అన్ని గ్రామాలలో వరి పంట సాగు చేస్తున్న రైతులు సామూహిక ఎలుకల నివారణ చర్యలను చేపట్టాలన్నారు. దీనిలో భాగంగా వీఏఏలు, వీహెచ్ఏలు సూచనల మేరకు మందును రైతులు తయారు చేసుకోవాలన్నారు. రైతులందరూ ఒకే రోజు ఎలుకల నిర్మూలన కార్యక్రమాన్ని చేపట్టడం ద్వారా సత్ఫలితాలు సాధించవచ్చన్నారు. ఎలుకల నివారణకు రాష్ట్రప్రభుత్వం వ్యవసాయశాఖ ద్వారా బ్రోమోడయోలిన్ అనే మందును 100శాతం రాయితీపై అందజేస్తున్నట్టు చెప్పారు. రెండు గ్రాముల బ్రోమోడ యోలిన్ మందును, 96 గ్రాముల నూకలు, రెండు గ్రాముల వంటనూనెను కలిపి 100గ్రాముల విషపుఎరను తయారుచేసుకోవచ్చన్నారు. ఒక్కొక్క ఎలుక బొరియలో 10 గ్రాముల విషపు ఎరను పొట్లాలుకట్టి వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం ఏఓ ప్రవీణ్, పార్టీ నాయకులు చేర్రెడ్డి కోటిరెడ్డి, చేర్రెడ్డి కృష్ణారెడ్డి, పేరం సర్వారెడ్డి, మద్దిగపు రమణారెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

కారెంపూడి మండలంలో..

కారెంపూడి: వరిలో సామూహిక ఎలుకల నిర్మూలనా కార్యక్రమాన్ని చేపట్టాలని సూచిస్తూ మండల వ్యవసాయశాఖ మండలంలోని అన్ని గ్రామాల రైతులకు ఎలుకల నివారణ మందు బ్రోమోడైల్‌ను మంగళవారం రైతులకు పంపిణీ చేశారు. గ్రామాలలోని రైతు భరోసా కేంద్రాలలో వ్యవసాయశాఖ సిబ్బంది విషపు ఎర తయారీపై డెమో నిర్వహించి రైతులకు చూపారు. నూకలు 96 గ్రాములకు 2 గ్రాముల నూనె, 2 గ్రాముల మందు కలిపి మిశ్రమం తయారు చేయాలని, ఈ ఎరను చిన్న చిన్న పొట్లాలుగా తయారు చేసి పొలంలో ఎలుకల బొరియలున్న చోట పెట్టాలని సూచించారు. రైతులందరూ ఒకే రోజు ఈ కార్యక్రమం చేపడితే సత్ఫలితాలు ఉంటాయని మండల వ్యవసాయశాఖ అధికారి యలమందారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని వరి సాగు చేస్తున్న రైతులకు 39.600 గ్రాముల మందును పంపిణీ చేసినట్టు పేర్కొన్నారు.

మాచవరం మండలంలో..

మాచవరం: వరి పంటకు అధిక నష్టం కలిగించే ఎలుకల నివారణకు బ్రోమోడయోలిన్ రసాయనాన్ని కలిసిన మిశ్రమాన్ని వాడాలని ఏఓ కె.రామమ్మ తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎలుకల నివారణకు చేపట్టాల్సిన చర్యలను రైతులకు తెలియజేశారు. 96 శాతం నూకలు, 2శాతం వేరుశనగ నూనె, 2శాతం బ్రోమోడయోలిన్ కలిపిన మిశ్రమాన్ని రైతులకు అందజేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల వ్యవసాయ సహాయకులు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో పొలం పిలుస్తోంది.

మండలంలోని శ్రీరుక్మిణీపురం, నాగేశ్వరపురం తండా గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. పంట పొలాలను పరిశీలించి, యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలను రైతులకు తెలియజేశారు.

సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

గురజాల రూరల్ : రైతులు విధిగా సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారిణి ఎం.సంధ్యారాణి రైతులకు సూచించారు. మాడుగుల గ్రామంలో ఎలుకల నివారణ కార్యక్రమంలో భాగంగా వరి సాగు చేసిన రైతులతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు సాగు, యాంత్రిక, జీవ నియంత్రణ, రసాయనిక పద్ధతులు పాటించాలన్నారు. ప్రభుత్వం రైతులకు వ్యవసాయ శాఖ ద్వారా బ్రోమోడయోలిన్ మందును వంద శాతం రాయితీపై అందిస్తుందన్నారు. కార్యక్రమంలో మండల ఉద్యానవన శాఖాధికారి మోహన్, సైంటిస్టు సైదా నాయక్, రైతులు పాల్గొన్నారు.



పిన్నెల్లిలో బ్రోమోడయోలిన్ తయారు చేస్తున్న వ్యవసాయ సహాయకులు



మాడుగులలో ఎలుకల నివారణ మిశ్రమాన్ని తయారు చేసిన దృశ్యం

ఇన్నర్‌వీల్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు

నాదెండ్ల: తమ ఆత్మీయుల జ్ఞాపకార్థం సేవా కార్యక్రమాలు నిర్వహించటం అభినందనీయమని చిలకలూరిపేట ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు గట్టు సరోజిని చెప్పారు. మంగళవారం క్లబ్ ఆధ్వర్యంలో కనపర్రు శివారు మైనంపాడులోని నైస్ పాఠశాలలో 200 మంది విద్యార్థులకు ఉచితంగా భోజన సౌకర్యం కల్పించారు. స్వర్గీయ తియ్యగూర కోటిరెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని వారి కుటుంబ సభ్యులు ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో క్లబ్ పాస్ట్ ప్రెసిడెంట్ రమాదేవి, సాంబశివ రావు, స్కూల్ హెచ్‌ఎం సుబ్బారావు, ప్రిన్సిపల్ గణపతి పాల్గొన్నారు. అనంతరం కారుమంచి శివరావు సతీమణి సరళ వర్ధంతి సందర్భంగా చిలకలూరిపేట పట్టణంలోని బాపూజీ వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం నిర్వహించి రెండు క్వింటాళ్ల బియ్యం, పది కేజీల కందిపప్పు అందించారు. ఇన్నర్‌వీల్ కార్యదర్శి నార్నె జయలక్ష్మి, దండా రమాదేవి, టి విశాలి, ఆశ్రమ నిర్వాహకులు మురికిపూడి ప్రసాద్ పాల్గొన్నారు.

వినుకొండలో కళాకారులు, గురువుల ఆత్మీయ సమ్మేళనం



గీతాలు ఆలపిస్తున్న గజల్ శ్రీనివాస్

వినుకొండ(నూజెండ్ల): హిమాలయ గురువు దివ్య ఆశీస్సులతో శాంతి ఆశ్రమ ట్రస్ట్ వినుకొండ ఆధ్వర్యంలో వినుకొండ మండలంలోని విఠంరాజుపల్లి గ్రామంలో గల శాంతి ఆశ్రమంలో సకల సాంస్కృతిక కళాకారులు, గురువుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. మంగళవారం జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్రం నలుమూలల నుంచి పీఠాధిపతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ పాశ్చాత్య సంస్కృతి ప్రభావంతో అంతరించిపోతున్న సనాతన ధర్మం, సాంప్రదాయ కలలు ప్రోత్సహించేందుకు వాటిని కొనసాగిస్తున్న కళాకారులు ఆధ్యాత్మిక గురువులు, ధార్మిక సేవకులను సత్కరించుకోవడం, భవిష్యత్ తరాలకు మన కలలను కీర్తిని అందించేందుకుందు అందరూ వారిని గౌరవించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ గజల్ శ్రీనివాస్ పాటలు ఆలపించారు. అనంతరం రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన 600 మంది కళాకారులను ఘనంగా సత్కరించారు. వెయ్యి దేవాలయాలకు ధూప దీపనైవేద్యాలకు చెందిన కిట్లను అందజేశారు. హాజరైన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి భారీ అన్నసంతర్పణ నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, పీఠాధిపతులు దయానంద దత్త స్వామి (ఏపీ సాధు పరిషత్ ఉపాధ్యక్షులు), శ్రీనివాసానంద స్వామి (ఏపీసాధు పరివార్ అధ్యక్షులు), భవాని స్వామి (శ్రీ బాలసిద్ది పీఠం), భైరవానంద స్వామీజీ (ప్రకాశం జిల్లా అధ్యక్షులు), నంద స్వామి అఘోర పీఠం, విజయశంకర స్వామి (అన్నమయ్య కళాక్షేత్ర), రుద్ర శివానంద సరస్వతి స్వామీజీ (మౌన స్వామి ఆశ్రమం), ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

కే-రిడ్జి స్కూల్‌కు సీబీఎస్ఈ గుర్తింపు

నరసరావుపేట ఈస్ట్: గుంటూరురోడ్డులోని కే-రిడ్జి స్కూల్‌కు సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) అధికారిక అనుబంధ గుర్తింపు లభించినట్టు స్కూల్ ప్రిన్సిపల్ జి.బర్నబాస్ మంగళవారం తెలిపారు. న్యూఢిల్లీలోని సీబీఎస్ఈ బోర్డు నుంచి వచ్చిన అధికారుల బృందం తమ పాఠశాలలోని విద్యా ప్రమాణాలు, మౌళిక వసతులు తదితర అంశాలను పరిశీలించిన అనంతరం గుర్తింపు అనుమతి మంజూరైనట్టు వివరించారు. పాఠశాలలో ఆధునిక విద్యా విధానాలు, సమగ్ర విద్యా శిక్షణ, వసతులను బోర్డు అధికారులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారన్నారు. సీబీఎస్ఈ గుర్తింపు లభించటం ద్వారా తమ విద్యార్థులకు దేశ వ్యాప్తంగా ఉన్న సమాన విద్య శిక్షణా విధానాలు అందుతాయన్నారు. అలాగే దేశ వ్యాప్తంగా నిర్వహించే విద్యా కార్యక్రమాలలో తమ విద్యార్థులు పాల్గొనేందుకు అవకాశం ఉంటుందని వివరించారు. సీబీఎస్ఈ గుర్తింపు లభించటం తమ పాఠశాల ఎదుగుదలకు కీలక ముందడుగు అని పేర్కొన్నారు. పాఠశాల చైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు, డైరెక్టర్ కోమటినేని నాసరయ్య ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించటం అభినందనీయం

చిలకలూరిపేట: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించటం అభినందనీయమని ఎస్ఎంకే జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం వై.హనుమంతరావు చెప్పారు. ఇటీవల నరసరావు పేటలోని డాక్టర్ కోడెల శివప్రసాదరావు స్టేడియంలో ఉమ్మడి గుంటూరు జిల్లా షెటిల్ బాడ్మింటన్ ఎంపిక పోటీలు జరిగాయి. ఈ పోటీలలో ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి 400 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పసుమర్రు జెడ్పీ హైస్కూల్‌కు చెందిన షేక్ పర్వీస్, ఎ శైలు, కె.కవిత, డి.దైవకీర్తి, షేక్ రషీద్, షేక్ సల్మాన్, షేక్ హబీబుల్లా, షేక్ వసీమ్‌లు ఉమ్మడి గుంటూరు జిల్లా బాలబాలికల జట్లకు ఎంపికయ్యారు. ఈ ఎనిమిది మంది విద్యార్థులు త్వరలో నిర్వహించే రాష్ట్రస్థాయి షటిల్ బాడ్మింటన్ పోటీలలో జిల్లా బాలబాలికల జట్లకు ప్రాతినిథ్యం వహిస్తారు. ఈ విద్యార్థులను మంగళవారం పాఠశాల ప్రాంగణంలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ కె.సుదర్శనరావు, వైస్ చైర్మన్ గౌసియా, 16వ వార్డు కౌన్సిలర్ షేక్ మస్తాన్‌వలి, పూర్వ విద్యార్థి సంఘం నాయకులు గద్దే హరిబాబు, ఉపాధ్యాయులు ఎస్‌కేఎండీ యాసిన్ పాల్గొన్నారు.